



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక :40 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం ఆదివారం 22 ఫిబ్రవరి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 40 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM SUN 22 FEBRUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## ఆ 'నాటకాల రాయుడు'
# రోజుకో వేషం వేశాడు

- తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ దోషులను కఠినంగా శిక్షిస్తామన్న సీఎం
- అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ పై వైసీపీ నిందలు
- అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైసీపీ బూతుల పార్టీనేనని విమర్శ
- రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యతలో ప్రజలు కలిసిరావాలని పిలుపు
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయిమయం చేసిందని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ మహా పాపానికి పాల్పడిన నిందితులను నడిరోడ్డుపై నిలబెట్టి శిక్షిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. వారి కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోవడానికే ఇప్పుడు హెరిటేజ్ సంస్థపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2024కు ముందు తిరుమల దర్శనానికి వెళ్లిన ప్రతి భక్తుడికి లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గిపోయిన విషయం అనుభవంలోకి వచ్చిందన్నారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసే అధికారం ఎవ్వరికీ లేదని, కానీ గత పాలకులు దాన్ని అపవిత్రం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "వారు కొనుగోలు చేసిన నెయ్యి నమూనాలను గుజరాత్‌లోని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకు (చీణణదీ) పరీక్షల నిమిత్తం పంపిస్తే, అది అసలు నెయ్యే కాదని, అందులో జంతువుల కొవ్వు కలిసిందని ల్యాబ్ నివేదిక ఇచ్చింది. దీనిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సెట్) సైతం తన నివేదికలో కీలక విషయాలను వెల్లడించింది. సరఫరా చేసింది నెయ్యి కాదని, కేవలం రసాయనాలతో తయారు చేసినట్లు తేల్చింది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ తప్పును తాము బయటపెడుతుంటే, దొంగే దొంగా అని అరిచినట్లుగా తిరిగి ప్రభుత్వంపైనే బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు.

**నాటకాల రాయుళ్లది రోజుకో వేషం**

వివేకానంద రెడ్డి హత్య ఘటనను ప్రస్తావిస్తూ... ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడని, చివరకు తన చిన్నాన్న కుమార్తె కూడా మోసపోయేలా నాటకాలు రక్తి కట్టించాడని పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. అలాంటి వారే ఇప్పుడు తిరుమల నెయ్యి విషయంలోనూ

- మిగతా 2లో



## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన
# దిగ్భ్రాంతి కలిగించింది

- ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం
- దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించారని తీవ్ర విమర్శ
- ప్రతిష్టాత్మక వేదికలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్న లోకేశ్
- ఆవిష్కరణలపై దృష్టిపెట్టి దేశాన్ని నిర్మించుకోవాలని పిలుపు

**పెన్ పవర్ డెస్క్:**ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న

- మిగతా 2లో

## ఈ నెల 26 నుంచి జనసేన
# ఉద్యమి సభ్యత్వాలు..
### నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు

- పార్టీ నేతలతో నాదెండ్ల మనోహర్ టెలీకన్ఫరెన్స్
- క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచన
- జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలన్న నాదెండ్ల



**పెన్ పవర్ డెస్క్:**జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం

- మిగతా 2లో



## 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..
### మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమో
### వెంకయ్యనాయుడు ఆందోళన

- విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాలన్న మాజీ ఉప రాష్ట్రపతి
- మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలన్న వెంకయ్యనాయుడు
- భారత్ విశ్వగురువు అయినా ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదన్న వెంకయ్యనాయుడు

- మిగతా 2లో



## వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది

- తిరుమల లడ్డూపై చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేశారన్న మల్లాది విష్ణు
- సీబీఐ రిపోర్టు వచ్చినా జగన్ పై బురద చల్లుతున్నారని మండిపాటు
- ఏకసభ్య కమిషన్ ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుందని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు..
# వాసుదేవరెడ్డి అరెస్ట్

- ఏపీబీసీఎల్ మాజీ ఎండి వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేసిన సీఐడీ
- ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలు చోరీ చేశారంటూ కేసు నమోదు
- ఇప్పటి వరకు అజ్ఞాతంలో ఉన్న వాసుదేవరెడ్డి

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసు కుంది. తాజాగా మరో అరెస్ట్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీబీసీఎల్) మాజీ ఎండీ,

- మిగతా 2లో

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను
# కూడా ఏరివేయడం సాధ్యమే

- అక్రమ వలసదారులను ఓటరు జాబితా నుంచే కాదు దేశం నుంచి తొలగిస్తామన్న అమిత్ షా
- అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని రాహుల్ గాంధీ చెప్పారన్న అమిత్ షా
- కానీ కాంగ్రెస్‌కు వారే ఓటు బ్యాంకు కాబట్టి పంపించలేరని విమర్శ



**పెన్ పవర్ డెస్క్:**నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదా రులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని,

- మిగతా 2లో




## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

- న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం
- ఏఐపై ప్రపంచ ఏకాభిప్రాయం
- సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' స్ఫూర్తితో డిక్లరేషన్ రూపకల్పన
- ఏడు కీలక స్తంభాల ఆధారంగా ఏఐపై అంతర్జాతీయ సహకారానికి పిలుపు
- ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఉపయోగించాలని తీర్మానం

**పెన్ పవర్ డెస్క్:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంత ర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచిం ది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించు కోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని

- మిగతా 2లో

## కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్..
## రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

- కొండాపూర్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- కబ్జాకు గురైన పార్కులు, ప్రజావసరాల స్థలాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా
- ఆక్రమణలు తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు
- కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం
- దశాబ్దాల సమస్య పరిష్కారమవడంతో స్థానికుల ఆనందం

- మిగతా 2లో




## పరీక్షలు ఉన్నాయని
# ఆందోళన వద్దు
### ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన



- ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచన
- పరీక్షలు బాగా రాయలేననే ఆందోళన వద్దన్న కవిత
- పరీక్షలు అనేవి పూర్తి జీవితంలో చిన్న అంశమని వ్యాఖ్య

- మిగతా 2లో



## మన స్నేహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా

- మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి నేడు
- 2022 ఫిబ్రవరి 21న గుండెపోటుతో మృతి చెందిన గౌతమ్ రెడ్డి
- గౌతమ్ రెడ్డిని స్మరించుకున్న జగన్

**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధం తి నేడు. ఈ సందర్భం గా తన స్నేహితుడు గౌతమ్ రెడ్డిని వైసీపీ అధినేత జగన్ స్మరించుకున్నారు.

- మిగతా 2లో

## భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర

- యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు... జైషే అంతర్జాతీయ కుట్ర!
- పబ్‌లు, క్లబ్బుల్లో దాడులకు యువతులను నియమించుకుంటున్న ఉగ్రసంస్థ
- పాక్ ప్రమేయం బయటపడకుండా విదేశీ మహిళల నియామకం
- గాజా సహాయం పేరుతో దాడులకు భారీగా నిధుల సేకరణ
- ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు జరపాలని ప్లాన్



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# బుర్రకథా పితామహుడు నాజర్

ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. " ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు. అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్.నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్. బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వలి". మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలలో దేవకి, శ్రీ కృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు. తెనాలిలోని "బాలరత్న నాటక సమాజం"లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృతాలలో నమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకంగా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు.అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో "అక్కినేని"కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, "ఆసామీ" నాటకాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామీ నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు.ఆంధ్రనాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవా చార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూచిన గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై "నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో" అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు."నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది" అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్‌టిఆర్ వచ్చినప్పుడు "నేను మీ అభిమానిని" అని నాజర్ చెపితే... "నేను మీ ఫాన్‌ను" అని ఎన్‌టిఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు. "హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు" అని ముదిగొండ శివప్రసాద్ తదితరప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూరులో మరణించారు.

## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

- మొదటి పేజి తరువాయి

నిర్దేశిస్తోం ది.'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది.

అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.

**ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.**

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ (Democratising AI Resources)
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు (Economic Growth and Social Good)
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ (Secure and Trusted AI)
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ (AI for Science)
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత (Access for Social Empowerment)
6. మానవ వనరుల అభివృద్ధి (Human Capital Development)
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు (Resilient, Efficient and Innovative AI Systems)

"ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది. శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడు

- మొదటి పేజి తరువాయి

అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. మసీదు, చర్చి, దేవాలయం ఏదైనా వాటి పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే టీటీడీలో ప్రక్షాళన ప్రారంభించామని తెలిపారు. శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు వెంకటేశ్వర స్వామి ఫొటోలను చెప్పులతో పట్టుకుని, సభలో రాజకీయం చేసి, ఆ తర్వాత ఫొటోలను అక్కడే పడేసి వెళ్లారని, వారికెందుకు ఇంత అహంకారమని ప్రశ్నించారు.

**అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అది బూతుల పార్టీనే**

వైసీపీ నేతల భాషపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గతంలో అసెంబ్లీలో నా భార్యపై అత్యంత నీచంగా మాట్లాడి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆ పార్టీ బూతులు మాట్లాడటం మాత్రం మానలేదు. ఆబోతుల మాదిరిగా తయారై రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. వారితో తిట్టించుకోవడానికే మనం రాజకీయం చేస్తున్నామా?" అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు, రౌడీ రాజకీయాలు చేస్తున్నారని, పరామర్శల పేరుతో వెళ్లి అమాయకులను తమ కార్ల కింద తొక్కించి చంపుతారని, కానీ వారిని పరామర్శించరని విమర్శించారు.

**రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేశారని, పరిశ్రమలను తరిమికొట్టి ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న నమ్మకాన్ని పోగొట్టారని చంద్రబాబు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, భవిష్యత్ ఆదాయాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు.

గత పాలకులు రాష్ట్రాన్ని గంజాయిమయం చేశారని, తమ ప్రభుత్వంలో మత్తు పదార్థాలు సేవించి ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందనే భయంతోనే మదనపల్లి అత్యాచార కేసులో నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. శాంతిభద్రతలకే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. చెడును నిరాకరించే శక్తి ప్రజల్లో వచ్చినప్పుడే రాజకీయ ప్రక్షాళన సాధ్యమవుతుందని, రాష్ట్రాన్ని కాపాడుకునే ఈ బృహత్కార్యంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకె ళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రా ష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు. భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.భవిష్యత్తులో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వారు ఓడిపోయారని వెల్లడించారు.

సమాజం కూడా అలాంటి వాళ్లను బహిష్కరించాలని హితవు పలికారు. రామాయణాన్ని అన్ని పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని అన్నారు.

తల్లిదండ్రులు, ఇంట్లోని పెద్దలు తమ పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలని వెంకయ్యనాయుడు సూచించారు. విద్యార్థులు, యువత ప్రతి దానికి గూగుల్ మీద ఆధారపడుతున్నారని, కానీ వారు దీనిని పక్కన పెట్టి బుర్రకు పని చెప్పాలని సూచించారు.

# వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది

తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేశారని, రాష్ట్రానికి పెద్దగా, బాధ్యతగా ఉండాల్సిన వ్యక్తి స్థానానికి ఇది తగదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని సీబీఐ సిట్ చార్జ్ షీట్ లో తెలిపిందని విష్ణు అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు కూటమి నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసేందుకు కుట్ర పన్నారని... సీబీఐ రిపోర్టు వచ్చినా జగన్ పై బురద చల్లడం మానుకోలేదని దుయ్యబట్టారు. నెయ్యి వ్యవహారంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుందని... వారికి తగ్గట్టుగానే రిపోర్టు ఇస్తుందని అన్నారు. శాసనమండలిలో ఇందాపూర్, భోలేబాబా, హెరిటేజ్‌పై చర్చకు వైసీపీ తీర్మానం ఇచ్చినా కూటమి ప్రభుత్వం ఎందుకు తోక ముడిచిందో సమాధానం చెప్పాలని విష్ణు డిమాండ్ చేశారు. జంతువుల కొవ్వు, బాత్ రూమ్ కెమికల్స్ కలిపారని ఏ ఆధారాలతో మాట్లాడారో చెప్పాలని అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారో కూడా వివరణ ఇవ్వాలని అడిగారు.

# కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.

వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి.ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్ఆర్ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు.

ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

# భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జీవవీ) ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి.జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం.

ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది.ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

# నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

- మొదటి పేజి తరువాయి

కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదారులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు.చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని

విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి వస్తే కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

# ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు..

- మొదటి పేజి తరువాయి

ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

# కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

- మొదటి పేజి తరువాయి

భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేం దుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

# పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు.ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

## ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు.. వాసుదేవరెడ్డి అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

ఐఆర్టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం స్కాంకు సంబంధించి విజయవాడలోని ఏపీబీసీఎల్ కార్యాలయం నుంచి ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలను చోరీ చేశారంటూ ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో ఆయనపై ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర అభియోగాలతో 2024 జూన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు.హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఐడీ సోదాలకు వెళ్లిన సమయంలో వాసుదేవరెడ్డి పరారయ్యారు. అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉండగా... తాజాగా సీఐడీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు.

# మన స్నేహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా

- మొదటి పేజి తరువాయి

ఎక్స్ వేదికగా భోవోద్వేగంతో కూడిన పోస్టును పెట్టారు. మన స్నేహాన్ని, జ్ఞాపకాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపారు. ఒక స్నేహితుడిగా, సోదరుడిగా ఎప్పటికీ గుర్తుండిపోతావని ట్వీట్ లో పేర్కొన్నారు. గౌతమ్ రెడ్డితో జగన్ ఎంతో సన్నిహితంగా ఉండేవారనే విషయం తెలిసిందే.

2022 ఫిబ్రవరి 21న గౌతమ్ రెడ్డి మృతి చెందారు. గుండెపోటుకు గురైన ఆయన హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఐసీయూలో దాదాపు 90 నిమిషాల పాటు వైద్యులు అత్యవసర చికిత్సలు చేసినప్పటికీ ఆయన ప్రాణాలు దక్కలేదు.

## జీకే వీధి లోని సీలేరు రహదారిపై గొయ్యి మూసివేత స్థానికులు హర్షం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి21:** గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో సీలేరు ప్రధాన రహదారిపై పైప్ లైన్ పనుల కోసం తీసిన గొయ్యి శనివారం సిమెంట్ కాంక్రీట్ తో మూసివేయబడింది.జీకే వీధి మండల కేంద్రంలో గత నెల రోజుల క్రితం పైపులైన్ ఏర్పాటు కోసం గొయ్యి తీయబడింది, అయితే దాన్ని సమయానికి మూసివేయకపోవడం వలన వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.
ఈ సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడంతో అధికారులు స్పందించి గొయ్యిని పూర్తిగా మూసివేశారు. ఘటనతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## సింహగిరిపై భక్తితో కూడిన 'శుచిశుభ్రత' యజ్ఞం




**"స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో సిబ్బంది సమగ్ర భాగస్వామ్యం**

**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 21 :** "పరిశుభ్రతే పరమో ధర్మః" అనే స్ఫూర్తిదాయక సందేశంతో సింహగిరి పర్వతం నేడు మరోసారి ఆధ్యాత్మిక ఉత్సాహంతో కళకళలాడింది. భక్తి, సేవ, బాధ్యతల సమ్మేళనంగా శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామివారి సన్నిధిలో ఘనంగా నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న "స్వచ్ఛ ఆంధ్ర" ఉద్యమంలో భాగంగా దేవస్థానం అధికారులు, సిబ్బంది సమగ్రంగా పాల్గొన్నారు.
శ్రమయే సేవ సేవయే శ్రేయస్సు..
దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. వెంకటరావు పర్యవేక్షణలో మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. ఆలయ ప్రాంగణం, అన్నదాన భవనం, ప్రసాద వితరణ కేంద్రాలు, గోశాల పరిసర ప్రాంతాలు, స్వామివారి నిత్య అన్నప్రసాద కేంద్రం తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.
భక్తులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలనే సంకల్పంతో ప్రతి విభాగం సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు.
ఈఓ స్వయంగా కొండపైన గల గోశాల, ప్రసాదాల పంపిణీ కేంద్రాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు అవసరమైన దిశానిర్దేశం చేశారు.
భక్తులతో ఈవో ఆత్మీయ సంభాషణ..
కార్ పార్కింగ్ ప్రాంతంలో భక్తులతో ముచ్చటించిన ఈఓ దర్శన సౌకర్యాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. దర్శనం ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగిందని భక్తులు తెలిపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.
"నా రాష్ట్రం నా బాధ్యత" ప్రతిజ్ఞ పాత పీఆర్ఓ కార్యాలయం వద్ద నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. "నా రాష్ట్రం నా బాధ్యత" అనే నినాదంతో సిబ్బంది అంతా కలిసి పరిశుభ్రత ప్రమాణం చేశారు.
ఈ సందర్భంగా ఈఓ జె. వెంకటరావు మాట్లాడుతూ "స్వామి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక ప్రశాంతతతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే మా లక్ష్యం. ప్రతి ఉద్యోగి తన దైనందిన జీవితంలో కొంత సమయాన్ని పరిశుభ్రతకు కేటాయిస్తే 'స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర' లక్ష్యం సాధ్యం అవుతుంది" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ సింగం రాధా, ఏఈఓ రమణమూర్తి, శానిటేషన్ ఏఈఓ పంతం శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారి సునీల్ కుమార్, జీవీఎస్కే ప్రసాద్, రమణ సత్యవాణి, రాజ్యలక్ష్మి, పిఆర్ఓ నాయుడు, దేవస్థాన సీనియర్ మరియు జూనియర్ సహాయకులు తదితర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఘనంగా అన్నంరెడ్డి అదీప్ రాజ్ జన్మదిన వేడుకలు






**పెందుర్తి, పెన్ పవర్, ఫిబ్రవరి 21 :** రాంపురం కార్యాలయంలో వైయస్సార్సీపి మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చి అదీప్ రాజ్‌కు ఆత్మీయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు..
ఈ సందర్భంగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై అదీప్ రాజ్‌కు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో హాజరైన ప్రముఖులు..
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అన్నంరెడ్డి అజయ్ రాజ్, బైలపూడి భగవాన్ జయరాం, మన్యం జిల్లా పరిశీలకులు సర్గడం చిన అప్పలనాయుడు, రాష్ట్ర కార్యదర్శులు పైలా శ్రీనివాస్, గండి రవికుమార్, జడ్పీటీసీ మరియు జిల్లా ఉపాధ్యక్షులు పైలా సన్యాసి రాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవి సాంబ, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, ఉప్పిలి కనకరాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బుస అప్పలరాజు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలు నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలిశెట్టి సురేష్ రాజ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కర్రి బాబు, గోరపల్లి శ్రీను, కోన రామారావు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ గొర్ల రామునాయుడు, వార్డు అధ్యక్షులు రాపర్తి మాధవరావు (95), దాసరి సత్తిబాబు (93), తమర్ల నర్సింగ్ (94), మెంతి మహేష్ (97), గంరెడ్డి మహాలక్ష్మి నాయుడు (88), అప్పికొండ మహాలక్ష్మీ నాయుడు (79), మద్ది శ్రీనివాస్ రెడ్డి (77), దాడి ఉమ మహేష్ (96) తదితరులు పాల్గొన్నారు.
అదేవిధంగా సర్పంచులు, ఎంపీటీసీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులు, యువజన విభాగం నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్ష.
ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, అదీప్ రాజ్ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నారని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, సంతోషాన్ని పంచుకున్న అదీప్ రాజ్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.
జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

## ఎర్రవరం గ్రామంలో అందుబాటులోకి వచ్చిన మంచినీటి పథకం




పెన్ పవర్ PEN POWER 24 NEWS
తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు

**నీళ్ల కోసం రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణం**

ఎర్రవరం గ్రామంలో మంచినీటి కష్టాలు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:** గూడెం కొత్త వీధి మండలం జీకే వీధి పంచాయతీ పరిధిలోని ఎర్రవరం గ్రామంలో నివసించే 80 కుటుంబాలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గ్రామంలోని ప్రభుత్వ మంచినీటి పథకం తరచుగా మరమ్మతులకు గురవ్వడం వలన, స్థానికులు రోజువారీ నీటిని పొందడానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటకు వెళ్ళవలసి వస్తోంది.స్థానికులు మాట్లాడుతూ, " గత రెండు నెలలుగా ఈ పథకం పడకేయడంతో పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళాం. అయినా పరిష్కారం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ వాసుల ఆరోగ్యానికి ఇది పెద్ద ముప్పుగా మారుతోందని, చిన్నారులు, వృద్ధులు కూడా ప్రతిరోజూ ఇబ్బందులు భోగుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి, మంచినీటి పథకాన్ని మరమ్మతు చేసి, స్వచ్ఛమైన, సరైన నీటిని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

epaperpenpower.in
20 Feb 2026 - Page 6




పెన్ పవర్ ప్రభావం ఎర్రవరంలో మళ్లీ ప్రవహించిన మంచినీరు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 21:**గూడెం కొత్త వీధి మండలంలోని ఎర్రవరం గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యకు 'పెన్ పవర్' కథనం పరిష్కారం చూపింది.గ్రామంలో ఇప్పటికే ఉన్న మంచినీటి పథకం మరమ్మతుల కారణంగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ సమస్యపై గ్రామ మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వారి ఆవేదనను ప్రతిబింబిస్తూ ఈ నెల 20వ తేదీన 'పెన్ పవర్' పత్రికలో "నీళ్ల కోసం రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణం" శీర్షికతో వార్త ప్రచురితమైంది.వార్త ప్రచురణకు స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ కళ్యాణ్ బాబు వెంటనే చర్యలు తీసుకుని పథకానికి అవసరమైన మరమ్మతులు పూర్తి చేయించారు. శనివారం నుంచి గ్రామంలో మళ్లీ మంచినీటి సరఫరా ప్రారంభమైంది.దీంతో గ్రామ మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ,సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ నాయకులు, వార్డు సభ్యులు అరికట్ల ఆంజనేయులు (అంజి), పెద్దలు రాజారావు కూడా పత్రిక విలేకరులకు ధన్యవాదాలు తెలిపారు.గ్రామ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, వాటి పరిష్కారానికి దోహదపడుతున్న 'పెన్ పవర్' మరొకసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది.


## "రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి"

**రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మరియు మీడియా అధికార ప్రతినిధి డా. మంచా నాగమల్లేశ్వరి**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 21 :**వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మరియు మీడియా అధికార ప్రతినిధి డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి ఘటనలను ప్రస్తావిస్తూ, ప్రజలలో భద్రతపై అ నుమానాలు నెలకొన్నాయని ఆమె పేర్కొన్నారు.
ఇళ్లపై దాడులు, పెట్రోలు బంకుల దహనం, రాజ కీయ ప్రత్యర్థులపై కేసులు నమోదు చేయడం వంటి సంఘటనలు వెలుగుచూస్తున్నాయని ఆమె తెలిపారు. శాసనసభలో మాత్రం శాంతి భద్రతలు సక్రమంగా ఉన్నాయని ప్రభుత్వం చెప్పడం వాస్తవ పరిస్థితులకు విరుద్ధమని విమర్శించారు.రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చట్టవ్యవస్థ బలోపేతంపై దృష్టి సారిం చాలని ఆమె సూచించారు. మహిళలపై దాడు లు, చిన్నారి బాలికలపై జరుగుతున్న ఘటన లపై ప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసు కుందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం అందించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు, వేగవంతమైన న్యాయస్థా నాలు ఏర్పాటు చేశారా? నిందితులకు కఠిన శిక్షలు విధించారా? అనే ప్రశ్నలు లేవనెత్తారు.
ప్రతిసారి పాత్రికేయ సమావేశాల్లో మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని ఆమె అభిప్రాయప డ్డారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని సూచించారు. మతపరమై న అంశాల కంటే రాజ్యాంగ విలువలను కాపాడ డం ముఖ్యమని పేర్కొన్నారు. మాటలకంటే కార్యాచరణతో ప్రజలకు నమ్మకం కల్పించాలని, రాష్ట్రంలో నిజమైన శాంతి భద్రతలు నెలకొల్పా లని, మహిళల రక్షణకు కఠిన చర్యలు తీసుకో వాలని, రాజకీయ ప్రతీకారాలను నిలిపివేయాల ని ఈ సందర్భంగా డా. నాగమల్లేశ్వరి డిమాండ్ చేశారు.

## మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల




**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, అమరావతి. ఫిబ్రవరి 21:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ (జీఏఐఎస్) కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సహాయం విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ. 4.75 కోట్లు మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు జమ చేయబడినట్లు వెల్లడించారు. మిగిలిన 5 మంది లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



## శాన్విరా ఇండస్ట్రీ లిమిటెడ్ గోడౌన్ సీజ్ చేసిన గాజువాక జీవీఎంసీ రెవిన్యూ అధికారులు





**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 21**
యెద్దుల వెంకటరమణారెడ్డి చెందిన శాన్విరా ఇండస్ట్రీ లిమిటెడ్ గోడౌన్ ఒక కోటి 90 లక్షల రూపాయలు జీవీఎంసీకి ఆస్థి పన్ను చెల్లించకపోవడంతో గాజువాక జీవీఎంసీ అధికారులు నోటీసు జారీ చేసారు.అప్పటికి స్పందించకపోవడంతో ఈరోజు ఆర్వో రామ్ నారాయణ ఆధ్వర్యంలో ఆర్ఐలు శివ, రెడ్డి మోహన్, రాజేందర్ సిబ్బంది సమక్షంలో గోడౌన్ సీజ్ చేసారు.

## సంతోషి మాత ఆలయం పునర్నిర్మాణానికి దాతలు ముందుకు

**కూర్మాన్నపాలెం పెన్ పవర్ , ఫిబ్రవరి 21** జీవీఎంసీ 69 వ వార్డు తుంగలాం గ్రామంలో గల శ్రీ జై సంతోషిమాత ఆలయ పున నిర్మాణం నిమిత్తం మింది వాస్తవ్యులు వైదా చంద్రశేఖర రావు ,లక్ష్మీ ప్రసన్న దంపతులు100,116 రూ. అక్షరాలఒక లక్ష నూట పదహారు రూపాయలు వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి చేతుల మీదుగా సంతోషిమాత ఆలయ కమిటీకి అందించారు.గ్రామ కమిటీ , ఆలయ కమిటీ దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## జీకే వీధిలో స్వచ్ఛ రథం ప్రారంభం

- స్వచ్ఛ రథంతో పారిశుధ్యం మెరుగు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 21**:గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛ రథాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు తెలిపారు. జీకే వీధి పంచాయతీకి కేటాయించిన స్వచ్ఛ రథాన్ని ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీటీసీ రిమెల రాజేశ్వరి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వ్యర్థాలను సేకరించడం ద్వారా పరిశుభ్రతను మెరుగుపరచడమే కాకుండా వాటి ద్వారా ఆదాయం పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.గ్రామ ప్రజలు స్వచ్ఛ రథ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో ఇమ్మానియేల్,పంచాయితీ కార్యదర్శి అరుణ్ కుమార్, కూటమి నాయకులు కాకూరు శేఖర్,రీమల పాల్,ముక్కల కళ్యాణి, వైసిపి నాయకులు వంతల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జర్రెల పాఠశాలలో పంచాయితీ నిధులతో డస్ట్‌బిన్ అందజేత



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 21**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జర్రెల పంచాయితీ బాలుర పాఠశాలలో పంచాయితీ నిధులతో డస్ట్‌బిన్‌ను శనివారం అందజేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన 'స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చెత్త చెదరగోట్టకుండా డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడం ద్వారా పరిశుభ్రత మెరుగుపడుతుందని అన్నారు. చెత్త పేరుకుపోవడం వల్ల మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, శుభ్రమైన పరిసరాల్లో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. డస్ట్‌బిన్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు సక్రమంగా వినియోగించి క్రమం తప్పకుండా శుభ్రం చేస్తే ఆరోగ్య సమస్యలు తగ్గి పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుందన్నారు.సర్పంచ్, సెక్రటరీ ఆధ్వర్యంలో డస్ట్‌బిన్‌ను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడపా విష్ణుమూర్తి, జనసేన పార్టీ పంచాయితీ ఉపాధ్యక్షుడు మణుగురు ప్రసాద్, సెక్రటరీ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ దువ్వాడలో విగ్మాట్2కే26 జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్







**కూర్మన్నపాలెం: పెన్ పవర్, ఫిబ్రవరి 21:**విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆటోనమస్, దువ్వాడ, విశాఖపట్నం లోని ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో విగ్మాట్2కే26 అనే జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్‌ను మార్చి 9 మరియు 10 తేదీలలో కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నా మని కళాశాల యజమాని ప్రకటనలో తెలిపారు.ఎ జర్నీ టువార్డ్స్ ఎక్సలెన్స్అనే థీమ్‌తో నిర్వహించబడుతున్న ఈ రెండు రోజుల కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న మేనేజ్‌మెంట్ విద్యార్థులకు తమ ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత మరియు నిర్వహణ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వేదికగా నిలవనుంది. ఈ మీట్ ద్వారా వ్యూహాత్మక ఆలోచన, సృజనాత్మకత, జట్టు భావన మరియు వృత్తిపరమైన అనుసంధానాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారని,

ఈ సందర్భంగా థింక్ ట్యాంక్ – బిజినెస్ ఐడియా ప్రెజెంటేషన్, వైరల్ వోర్టెక్స్ – మార్కెటింగ్ ఈవెంట్, పేపర్ ట్రెండ్జ్ – పోస్టర్ ప్రెజెంటేషన్, మిస్టరీ రన్ – ట్రెజర్ హంట్, గ్రాండ్యూర్ గాలా – సాంస్కృతిక కార్యక్రమం, కనెక్ట్ ఎక్స్ – హెచ్‌ఆర్ ఈవెంట్, ఫిన్ ఫ్రెంజ్ – ఫైనాన్స్ ఈవెంట్, బ్రెయిన్ అండ్ బాష్ – బిజినెస్ క్విజ్, స్క్విడ్ గేమ్ – బిజినెస్ గేమ్స్, క్లిక్–ఎక్స్ – ఫోటోగ్రఫీ కాంటెస్ట్ వంటి పలు పోటీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోటీల్లో విజేతలకు మొత్తం రూ. 50,000 వరకు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదన రావు, మరియు ఎంబీఏ విభాగాధిపతి డా. బి. చంద్ర మాట్లాడుతూ విగ్మాట్2కే26 ద్వారా భవిష్యత్ వ్యాపార నాయకులను తీర్చిదిద్దడం మా సంస్థ లక్ష్యం. జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ నిర్వహణ ప్రతిభ, సృజనాత్మక ఆలోచన, పోటీ మనోభావాన్ని ప్రదర్శించుకునే అవకాశం కల్పించడం గర్వకారణం. ఈ కార్యక్రమం విద్యార్థులకు విలువైన అనుభవాన్ని అందించడంతో పాటు పరిశ్రమవిద్యా రంగాల మధ్య బంధాన్ని మరింత బలపరుస్తుంది" అని తెలిపారు.

ఈ జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, దేశవ్యాప్తంగా విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బొర్రాలో ఉపాధి హామీ సోషల్ అడిట్ గ్రామసభ.

**ఉపాధి పనుల ద్వారా గిరిజనులకు సుస్థిర ఆస్తులు కల్పన సర్పంచ్ జన్ని అప్పారావు. ఎంపీటీసీ అరుణ నవీన్.**



**ఆనంత గిరి పెన్ పవర్ ఫిబ్రవరి 21.** బొర్రా గ్రామపంచాయతీ లో శనివారం సర్పంచ్ జన్ని అప్పారావు, ఎంపిటిసి అరుణ నవీన్ అద్వర్యంలో ఉపాధి హామీ సోషల్ అడిట్ గ్రామసభ నిర్వహించారు.

ఈ గ్రామసభను ఉద్దేశించి సోషల్ ఆడిట్ డిఆర్పి రాజేష్ ముందుగా మాట్లాడుతూ 2024-025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 181 రకాల అభివృద్ధి పనులకు 4 కోట్ల ఇరవై ఏడు లక్షల రూపాయలు ఖర్చు జరిగిందన్నారు. వేజ్ అండ్ మెటీరియల్ పనులను ఉపాధి వేతనదారుల సమక్షంలో సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. సర్పంచ్ జన్ని అప్పారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారానే గిరిజన కుటుంబాలు అభివృద్ధి మరియు సుస్థిర ఆస్తుల కల్పన అన్నారు. ఈ గ్రామసభలో సోషల్ ఆడి టీం వినోద్, పవన్, పంచాయతీ సెక్రటరీ మోదేశ్ , పెసా కమిటీ సభ్యులు, దానియల్, రాంబాబు, వార్డ్ మెంబర్లు, సుబ్బారావు, ఉపాధి సిబ్బంది మరియు వేతన దారులు పాల్గొన్నారు.

## బీసీ రోడ్డు విస్తరణ , డ్రైన్ల నిర్మాణం పనులు.



**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 21:**జీవీఎంసీ 66వ వార్డులో బాల చెరువు రోడ్డు లో జరుగుతున్న డ్రైన్ ల నిర్మాణం , రోడ్ల విస్తరణ కొరకు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్ని వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను తెలుగుదేశం పార్టీ శ్రేణులు పరిశీలించారు .ముందుగా నిర్ణయించిన ప్రకారంగా దర్గా దగ్గర నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు జరుగుతున్న పనులు పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు, ఈ కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు, గాజువాక ప్రాంతం అభివృద్ధి, వార్డులో 80 శాతం రోడ్లు కాలువలు పూర్తి అవటం జరిగిందని,ఉన్న పనులను కూడా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయన సహాయ సహకారాలతో ఉన్న వర్కును కూడా పూర్తిచేసి, గాజువాక లోనే 66వ వార్డు ఉత్తమ వార్డుగా తీర్చిదిద్దే దిశగా కార్యవర్గం మొత్తం పనిచేస్తున్నారు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న పల్లా శ్రీనివాసరావు కి, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## చింతపల్లి రూటులో మార్కెట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 21)** :నర్సీపట్నం పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీసులు చేపట్టిన ప్రత్యేక చర్యలకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నర్సీపట్నం పట్టణంలో శనివారం ఉదయం టౌన్ సీఐ గఫూర్ ఆధ్వర్యంలో ఎస్.ఐ. రమేష్ మరియు పోలీసు సిబ్బంది కలిసి మునిసిపాలిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీ సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టారు. రోడ్డుపై ఏర్పడుతున్న రద్దీ కారణంగా వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు.

కోవిడ్ కాలంలో తాత్కాలికంగా ప్రారంభమైన కూరగాయల మార్కెట్ ప్రస్తుతం శాశ్వత రూపం దాల్చడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమయ్యింది. ముఖ్యంగా అయ్యన్న కాలనీ నివాసితులు, విద్యార్థులు, వాహనదారులు పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసినప్పటికీ, సరైన స్పందన లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అయితే తాజాగా పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల దుకాణాలు, తోపుడు బళ్ళు, సరుకు రవాణా వాహనాలు రోడ్డుపై అడ్డంగా నిలిపివేయకుండా, వాహన రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా సక్రమంగా సర్దుబాటు చేశారు. రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సులభంగా చేరుకునేలా చర్యలు చేపట్టినట్లు సిఐ గఫూర్ తెలిపారు.

అదేవిధంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించే వ్యాపారులు, వాహనదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పూర్తిస్థాయిలో మార్కెట్‌ను అనుకూల ప్రదేశానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. తరచూ ఇలాంటి ప్రత్యేక డ్రైవులు నిర్వహించడం కాకుండా, దీర్ఘకాలిక చర్యలు తీసుకుంటేనే ట్రాఫిక్ సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

పట్టణంలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణలో సమగ్ర ప్రణాళిక అవసరమనే అంశం మరోసారి స్పష్టమైంది.

## 66 వార్డులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 21:**జివియంసి 66 వార్డులో ప్రతినెల మూడవ శనివారం జరిగే శుభ్రత పరిశుభ్రతపై, స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, కార్యక్రమం కొత్త గాజువాక జంక్షన్లో పెట్రోల్ బంకు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ పైన, ఆరోగ్య పరిశుభ్రత పైన ప్రతి షాప్ కి వెళ్లి వివరించడం జరిగింది, ఈ కార్యక్రమం జీవీఎంసీ అధికారులు డి ఎమ్ హెచ్ ఓ

శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది, వార్డులో ఉన్న సెక్రటరీలు వార్డు అధ్యక్షులు గోమాడ వాసు, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, రతన్ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు శుభ్రత కోసం పరిశుభ్రత కోసం ప్రాంతాలు, వార్డులో ఉన్న పెద్ద గడ్డల్ని, కాలవుల్ని పరిశుభ్రంగా ఉంచుట కొరకు తగు జాగ్రత్తలు తీసుకుంటామంటూ అధికారులు వివరించారు.

## ఏయూలో ఉద్రిక్తతకు ఆ ఎస్ ఎస్ కారణం : ప్రియాంక దండి



**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 21:**బీజేపీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఆర్ ఎస్ ఎస్ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయని ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీని విస్తరించాలని చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏ ఎస్ ఎఫ్ ఐ, ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి నాయకులపై ఏ బి వి పి, ఆర్ ఎస్ ఎస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తున్నామని, ఆర్ ఎస్ ఎస్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చొరబడి గొడవలు చేయడానికి సిద్ధమవుతోందని, వీసీ ఆర్ ఎస్ ఎస్ సానుభూతిపరుడని చూసి చూడన్నటు వదిలేస్తాడని గతంలోనే హెచ్చరించానని, ఇప్పుడు అదే నిజమైందని ప్రియాంక అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్ ఎస్ ఎస్ శాఖ కార్యకలాపాలు వాలీబాల్ కోర్టు మరియు మైదానంలో చేస్తుండగా ఏ ఐ ఎస్ ఎఫ్, ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి నాయకులు ప్రశ్నించగా వారి పై దాడి చేసారని, వీసీ అనుమతి ఎలా ఇచ్చారని, ఏ బి వి పి కార్యక్రమాలలో ఆర్ ఎస్ ఎస్ కు చెందిన వ్యక్తులు పాల్గొంటే వీసీ నిద్రపోతున్నారా అని ఆమె ప్రశ్నించారు. ఏ యూ విద్యార్థుల పై ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు చేసిన దాడి పై విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను ప్రియాంక డిమాండ్ చేసారు. ఏ యూలో ఉద్రిక్తత తగ్గిన తరువాత విద్యార్థి నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మళ్లీ ఆర్ ఎస్ ఎస్ యూనివర్సిటీలో అడుగు పెట్టకుండ, విద్యార్థుల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టకుండ చర్యలు తీసుకోవాలని, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, అలాంటిది ఆర్ ఎస్ ఎస్ మూకలు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెడ్డ పేరు తీసుకువచ్చారని, యూనివర్సిటీలో శాంతియుత వాతావరానికి అధికారులుకు మరియు ప్రభుత్వానికి వినతిపత్రం అందిస్తామని ప్రియాంక తెలిపారు.

## చింతపల్లి ఐటీఐలో స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహణ

**స్టాఫ్ రిపోర్టర్,చింతపల్లి/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 21:** చింతపల్లి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.జడ్పిటిసి పోతురాజు బాలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా ఐటిఐ ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది, విద్యార్థులతో కలిసి స్వచ్ఛంద ర్యాలీ నిర్వహించడం జరిగింది.అంతేకాక, స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర వ్యాసరచన పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు కూడా అందజేయబడింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన రావు, శిక్షణ అధికారులు రమణ, తేజస్విని, ఐటిఐ సిబ్బంది ఆనంద్, రాంప్రసాద్, సతీష్, రణదీప్, వెంకన్న దొర, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



# గోషా ఆసుపత్రిలో ఆర్వో తాగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం





**పేద రోగులకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

**విశాఖ, దక్షిణ పెన్ పవర్ ఫిబ్రవరి 21:** పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్థానిక శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో ప్రభుత్వ గవర్నమెంట్ విక్టోరియా హాస్పిటల్ (గోషా ఆసుపత్రి)లో ఏర్పాటు చేసిన ఆర్వో తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచేందుకు కృషి కొనసాగుతుందని, గోషా ఆసుపత్రిలో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నరసింహాచారి, సూపరింటెండెంట్ ఉషా ప్రసాద్, కూటమి శ్రేణులు, స్థానిక నాయకులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుర్ జీవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 మంది పిల్లలకు పోషకాహార, విద్యా సామగ్రి పంపిణీ







**విశాఖ దక్షిణ పెన్ పవర్ ఫిబ్రవరి 21**
పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం పోషకాహారం, విద్య అత్యంత కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయుర్ జీవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 30 మంది పిల్లలకు పోషకాహార పదార్థాలు మరియు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొటెక్షన్ కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి పి. భాస్కర్ మరియు సి ఆర్ పి ఎఫ్ కన్వీనర్ అబ్దుల్ మున్నీర్ హాజరయ్యారు. అదేవిధంగా ఐ హావ్ ఫౌండేషన్ నుండి వాలంటీర్లు పాల్గొన్నారు.
పి. భాస్కర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పోషకాహారం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ విద్యపై దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలనే విషయాలపై కూడా అవగాహన కల్పించారు.
అబ్దుల్ మున్నీర్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని నిర్వహించిన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎస్. సుబ్బలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలను బాల్యవివాహాలు, బాల కార్మికత్వం వంటి సమస్యల నుండి దూరంగా ఉంచి చదువుపై దృష్టి పెట్టేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐ హావ్ ఫౌండేషన్ వాలంటీర్లు ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో పోషకాహారం, పుస్తకాలను అందించామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు కొందరికి నైపుణ్య శిక్షణ అందించగా, దాని ద్వారా జీవనోపాధి పొందిన వారు తమ అనుభవాలను పంచుకున్నారు.
కార్యక్రమంలో పి. భాస్కర్, అబ్దుల్ మున్నీర్, గురు, ఎస్. సుబ్బలక్ష్మి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

## సంకల్ప కళా గ్రామంలో విజయవంతంగా ముగిసిన కార్యశాల






- నేవీ ఫ్లీట్ రివ్యూ ప్రతినిధులతో మూడవరోజు
- పర్యావరణ హితంగా జీవించుదాం అన్ని ప్రతినిధులు
- 50 దేశాల నావికాదళ ప్రతినిధులను ఆకట్టు కున్న సంకల్ప

**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 21:** భారతీయ నౌక దళం విశాఖపట్నం నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫ్లీట్రివ్యూ లో భాగంగా మూడవరోజు పెందుర్తి మండలం పినగాడి గ్రామానికి చేరువలో సంకల్ప కళ గ్రామంలో సహజరంగుల అద్దకం మీద కార్యశాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా ఉన్న పలువురు నావికాదళ అధికారుల కుటుంబీకులు పాల్గొన్నారు.నేవీ వెల్ఫేర్ అండ్ వెల్నెస్ అసోసియేషన్ ఈస్ట్రన్ రీజియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంకల్ప కళా గ్రామంలో తయారవుతున్న వివిధ చేతి వృత్తులను పరిశీలించారు. సహజ రంగులతో తయారయ్యే చేనేత వస్త్రాలు, ప్రకృతి ఆధారంగా తయారు చేస్తున్న లక్క బొమ్మలు, పురాతన పద్ధతి లో ఆరోగ్యకరంగా ఎద్దు, కట్టె గానుగతో తయారు చేస్తున్న నూనెలును పరిశీలించారు. అలాగే సంకల్ప కళా గ్రామంలో సహజంగా పురాతన పద్ధతిలో పండించి తయారు చేస్తున్న పప్పు ధాన్యాలను విసరడం, దంచడం వంటి పనులను వారు కూడా ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు, అలాగే వాటితో దించి, విసిరి ఆనందించారు. అనంతరం ఈ ప్రతినిధుల బృందం సహజరంగులతో టై అండ్ డై వర్క్ షాప్ లో పాల్గొని వివిధ రకాల ఆకృతల్లో దుస్తులను నేయడం , రంగులు అద్దడం, వస్త్రాలు కుట్టడం చూసి తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతి ఆధారంగా పండించిన పంటలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ఆరగించారు.
ఈ కార్యక్రమంలో నావికాదళ ఉన్నతాధికారుల సతీమణులు , పిల్లలు పాల్గొన్నారు. సంకల్ప కళా గ్రామం తరపున జమీల్యా ఆకుల కార్యక్రమాలను సమన్వయపరిచారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల వర్మ, జర్నలిస్ట్ నాయకుడు డాక్టర్ ఎంఆర్ఎన్ వర్మ గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, తులసి నేచురల్స్ అధినేత తూర్పాటి సత్యనారాయణ , జనరేషన్ యువ ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు. సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు ఆయన సతీమణి పార్వతి, సిబ్బంది అలుపెరుగకుండా పూర్తి స్థాయిలో కృషి చేశారు.

## స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను స్టేట్ అథ్లెటిక్స్ కమిటీ పరిశీలన





**కూర్మాన పాలెం పాలెం , పెన్ పవర్, ఫిబ్రవరి 21** .
జీవీఎంసీ 87 వార్డు పరిధి సిద్ధార్థ నగర్ మరియు కళింగ వీధికి ఆనుకొని ఉన్న నాలుగున్నర ఎకరాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణపు పనులను వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం ఆధ్వర్యంలో స్టేట్ అథ్లెటిక్స్ కమిటీ పరిశీలించారు.అనంతరం వారు రాష్ట్ర అధ్యక్షుడు ,గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ను కలిసి అట్లాటిక్స్ క్రీడాకారులకు ఉపయోగపడే పరికరాలను ఎర్పాటు చేయుటకు ప్రణాళికను వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రాజన్ రాజు, జాన్ రమేష్, దాలయ్య, ఏ టి ఎన్ మూర్తి, స్టేట్ అథ్లెటిక్ కమిటీ ఎమ్ నారాయణరావు, అనంతలక్ష్మి, వైకుంఠ రావు, మంగవరప్రసాద్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విఎమ్ఆర్డిఏ సిబ్బంది



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 21 :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించిన "స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న "స్వ చ్ఛాంధ్రస్వచ్ఛ విశాఖ" కార్యక్రమం శనివారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి సంస్థ కార్యాలయంలో నిర్వహించారు.
చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో ఉ ద్యోగ్ భవన్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం చేపట్టారు. కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని అధికారులు, సిబ్బంది స్వయంగా తొలగించి పరిశుభ్రతకు కట్టుబడి ఉన్నామనే సంకల్పాన్ని చాటారు.
అనంతరం కార్యదర్శి మురళీకృష్ణ సిబ్బందిచేత ప్రతిజ్ఞ చేయించారు. విశాఖ నగరాన్ని మరియు తమ పరిసరాలను మరింత శుభ్రంగా, పచ్చగా మార్చేందుకు కృషి చేస్తామని, రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో ప్రణాళికాధికారులు, పరిపాల నాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని స్వచ్ఛతపై తమ బాధ్యతను స్పష్టంగా వ్యక్తపరిచారు.రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే కాకుండా, పర్యావరణ పరిర క్షణకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## విశాఖపట్నం పోర్టు అథారిటీ సహకారంతో దక్షిణ నియోజకవర్గ మహిళలకు 100 ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ



**విశాఖ దక్షిణ పెన్ పవర్ ఫిబ్రవరి 21:** దక్షిణ నియోజకవర్గంలో మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తున్నానని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం తన ప్రధాన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.
విశాఖపట్నం పోర్ట్ అథారిటీ వారి సహకారంతో దక్షిణ నియోజకవర్గంలోని వివిధ వార్డులకు చెందిన మహిళలకు అంబికా బాగ్ కళ్యాణ మండపంలో 100 ఉచిత కుట్టు యంత్రాలను పంపిణీ చేశారు. పోర్టు అథారిటీ సామాజిక బాధ్యత నిధుల ద్వారా ఈ కుట్టు యంత్రాలను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.
మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్థిరపడాలని, కుటుంబాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోర్టు చైర్మన్‌తో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని మరిన్ని మహిళలకు త్వరలో కుట్టు యంత్రాలను అందజేయనున్నట్లు వెల్లడించారు.
కార్యక్రమంలో పోర్టు అధికారులు, స్థానిక నాయకులు, మహిళలు మరియు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


## దారకొండలో పర్యటించిన ఎస్టీ కమీషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, పిబ్రవరి 21:** గూడెం కొత్తవీధి మండలం దారాలమ్మ ఆలయాన్ని ఎస్టీ కమీషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి శనివారం సందర్శించారు.ఆలయ కమిటీ ఎస్టీ కమీషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా ఈ సందర్భంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైర్మన్ దారాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని ఎస్టీ కమీషన్ చైర్మన్ బొజ్జరెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా ఆలయంలో నెలకొన్న సమస్యలు చైర్మన్‌కు కమిటీ సభ్యులు వివరించారు.అనంతరం దారకొండ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పాఠశాలలో మంచినీటి సమస్య మరుగుదొడ్ల సమస్య అధికంగా ఉన్నట్లు విద్యార్థులు ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ డీడీ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు వైద్యాధికారితో పీహెచ్సీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మిస్తున్న ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. అల్లూరి జిల్లాలోని ఆర్వీనగర్ నుంచి పోలవరం జిల్లా పాలగెడ్డ రహదారి దుస్థితి గురించి స్థానికులు ఎస్టీ కమీషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బాబ్జి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే పాలన తెచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుంది


రూ.43.60 లక్షలతో తమ్మెంగులలో నూతన సచివాలయం ప్రారంభం





**స్టాఫ్ రిపోర్టర్,చింతపల్లి,గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఫిబ్రవరి 21:**అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తమ్మెంగుల గ్రామ పంచాయితీలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని శాసన సభ్యులు, వైఎస్ఆర్‌సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు శనివారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన అందించే లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. గతంలో ధ్రువపత్రాలు తదితర పనుల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం గ్రామ సచివాలయాల ద్వారా వాలంటీర్ల సహకారంతో సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు.తమ్మెంగుల పంచాయితీ మారుమూల ప్రాంతమై ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని, రహదారులు తదితర మౌలిక వసతులు కల్పించడంతో ప్రాంత అభివృద్ధి సాధ్యమైందని అది కేవలం వైసీపీ పార్టీకే దక్కుతుందని తెలిపారు. మళ్లీ మన ప్రాంతాలు మరింత సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ప్రజల సహకారం అవసరమని మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి పోతురాజు బాలయ్య,ఎంపీడీవో సీతామాలక్ష్మి, సర్పంచ్ బాలయ్య, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## అధికారులూ.. దయచేసి కల్వర్టు నిర్మించండి





**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 21)** :నర్సీపట్నంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట కల్వర్టు కూలిపోయి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పునర్నిర్మాణం చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ఈ పరిస్థితి నెలకొనడం ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మెయిన్ రోడ్డు ఆనుకుని ఉన్న డ్రైనేజీ కల్వర్టు కూలిపోయిన ఘటనకు సంవత్సరం దాటినా సమస్య అలాగే ఉండిపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. గతంలో మున్సిపల్ సమావేశంలో ఈ అంశంపై చర్చించినప్పటికీ ఆచరణలో మాత్రం పురోగతి కనిపించలేదు. ఈ కల్వర్టు నిర్మాణ బాధ్యత ఏ శాఖదనే అంశం స్పష్టత లేకుండాపోయింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఆర్ అండ్ బి శాఖ మరియు మున్సిపాలిటీ అధికారులు పరస్పరం బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది మీ శాఖ పరిధిలోనిది అంటూ తప్పించుకోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.
ఆర్టీసీ ఆధ్వర్యంలోని కాంప్లెక్స్‌లోని వాణిజ్య దుకాణాల నుంచి అద్దెల వసూళ్లలో చురుకుగా వ్యవహరించే అధికారులు, మౌలిక సదుపాయాల పరిరక్షణలో మాత్రం చొరవ చూపకపోవడం విచారకరమని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు కారణమయ్యే పరిస్థితి నెలకొన్నా ఎటువంటి తాత్కాలిక భద్రతా చర్యలు కూడా తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
ఈ దారిలోనే నిత్యం సంచరించే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గమనించి అధికారులను ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలనే ఆలోచనైనా అధికారులకు ఉందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు మరియు ద్వితీయశ్రేణి నాయకులు ఇలాంటి చిన్న సమస్యల పరిష్కారానికైనా ముందడుగు వేయకపోవడం బాధాకరమని స్థానికులు అంటున్నారు.
ప్రజల రాకపోకలకు కీలకమైన ప్రాంతంలో నెలకొన్న ఈ సమస్యపై సంబంధిత శాఖలు సమన్వయంతో వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. బాధ్యత ఎవరిదన్న దానికంటే ప్రజల భద్రత ముఖ్యమని, ఇకనైనా అధికారులు స్పందించి కల్వర్టు పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన స్పీకర్



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 21) :** నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. శనివారం నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నలుగురు లబ్ధిదారులకు రూ. 12 లక్షల 31 వేల విలువైన చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.
ఈ విడతలో మాకవరపాలెం మండలానికి చెందిన ఇద్దరు, నాతవరం మండలానికి చెందిన ఒకరు, నర్సీపట్నం మండలానికి చెందిన ఒకరికి ఈ సహాయం అందింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 164 మంది లబ్ధిదారులకు రూ.1.67 కోట్ల మేర ఆర్థిక సాయం అందించినట్లు స్పీకర్ వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తామని, ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యన్నారాయణ, నాతవరం మండలం టిడిపి పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి వెంకటరమణ, మాకవరపాలెం మండలం టిడిపి పార్టీ ప్రెసిడెంట్ ఆర్ వై పాత్రుడు, అనకాపల్లి పార్లమెంట్ అధికార ప్రతినిధి లాలం శ్రీరంగస్వామి, ఎంపిటిసి బోళెం రాంప్రసాద్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మిలేనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ క్యాంపస్




డ్రైవ్‌లో 20 మందికి ఉద్యోగావకాశాలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 21 :**డిజిటలైజేషన్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియా మరియు డిజిటల్ మార్కెటిం గ్ రంగాల్లో నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాం డ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఆధ్వర్యంలో నిర్వ హించిన క్యాంపస్ డ్రైవ్‌లో 20 మంది విద్యార్థు లు ఎంపికయ్యారు. ఈ డ్రైవ్‌ను ప్రముఖ ఎడ్ టెక్ సంస్థ సంయుక్తంగా నిర్వహించింది.సోషల్ మీడియా మేనేజర్, గ్రాఫిక్ డిజైనర్, డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్ పోస్టుల కోసం నిర్వహిం చిన ఈ నియామక కార్యక్రమంలో సోషల్ మీ డియా, గ్రాఫిక్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్ రంగాల్లో నైపుణ్యం కలిగిన సుమారు 55 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 20 మంది అభ్యర్థులు ఎంపిక కాగా, అందులో 15 మందికి మిలేనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అవకాశాలు లభించాయి.ఈ సందర్భంగా సంస్థ సెంట్రల్ మేనేజర్ వరదా రవి కుమార్ మాట్లాడుతూ, గత ఏడాది కాలంలో సోషల్ మీడియా మరియు డిజిటల్ మార్కెటిం గ్ నిష్ స్కిల్స్‌కు కనీసం 1015 శాతం వరకు డిమాండ్ పెరిగిందన్నారు. వ్యాపారాలు వేగంగా ఆన్‌లైన్ వేదికలకు మారుతున్న నేపథ్యంలో ఈ రంగం విద్యార్థులకు ఆశాజనక కెరీర్ మార్గంగా మారిందని పేర్కొన్నారు. మిలేనియం సంస్థ రి యల్-టైమ్ ప్రాజెక్టుల ఆధారంగా శిక్షణ అంది స్తూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరుస్తోం దని తెలిపారు. గతంలో , సంస్థలతో కలిసి కూ డా క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహించినట్లు గుర్తుచేశారు.సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ ,సోషల్ మీడియా మార్కెటింగ్ , కంటెంట్ మార్కెటింగ్, యానిమేషన్, గ్రాఫిక్ డిజైనింగ్, వీడియో ఎడి టింగ్‌లలో డిప్లొమా కోర్సులు రియల్-టైమ్ ప్రా జెక్టులతో అందిస్తున్నామని తెలిపారు. విద్యా ర్థులు సమయానికి తగినట్లుగా తమ స్కిల్ సెట్‌ను అభివృద్ధి చేసుకుంటేనే ఇంటర్వ్యూ లను ధైర్యంగా ఎదుర్కోగలరని సూచించారు.
సిస్యా క్లాస్ హెచ్‌ఆర్ మేనేజర్ యు. పుష్ప మాట్లాడుతూ, అన్ని రంగాల్లో డిజిటల్ మార్కె టింగ్ వినియోగం పెరుగుతున్నందున కెరీర్ అవకాశాలు విస్తృతమయ్యాయని పేర్కొన్నా రు. మిలేనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ నాణ్య మైన శిక్షణ అందిస్తున్న సంస్థగా పేరుపొందింద ని, నైపుణ్యం కలిగిన అభ్యర్థులను అందించినం దుకు అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మిలేనియం డిజిటల్ మార్కె టింగ్ ఫ్యాకల్టీ పి. అవినాష్, సిస్యా క్లాస్ హెచ్ ఆర్ ఎగ్జిక్యూటివ్ లక్ష్మీ గాయత్రి పాల్గొన్నారు. ఎంపికైన అభ్యర్థులను ఇరు సంస్థల ప్రతినిధు లు అభినందించారు.

## ఏఐ క్వాంటం యుగానికి ఆంధ్రప్రదేశ్ దిక్సూచి:

సీఎం చంద్రబాబు దూరదృష్టికి ప్రపంచ స్థాయి ప్రశంసలు




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 21 :**భవిష్యత్తు సాంకేతిక మార్పులను ముందుగానే అంచనా వేసి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించే దార్శనిక నాయకత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నా రు. నాడు ఐటీ విప్లవానికి శ్రీకారం చుట్టిన నా యకుడు, నేడు కృత్రిమ మేధస్సు (ఏఐ)క్వాం టం యుగానికి దిశానిర్దేశం చేస్తున్న విజనరీగా నిలిచారని ఆయన కొనియాడారు.ఐటీ నుంచి క్వాంటం దాకా దూరదృష్టి 1998లో హైటెక్ సిటీ ప్రారంభంతో ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పుకు నాంది పలికిన చంద్రబాబు, ఇప్పుడు అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేయడం ఆయన దూరదృ ష్టికి నిదర్శనమని పల్లా తెలిపారు. ప్రపంచ సాం కేతిక పోటీలో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెట్టా లన్న లక్ష్యంతో తీసుకున్న నిర్ణయాలు చరిత్రా త్మకమని వ్యాఖ్యానించారు.అమరావతి క్వాం టం వ్యాలీ శతాబ్దపు వ్యూహం అమరావతిలో ప్రతిపాదిత క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ రాబోయే శతాబ్దపు సాంకేతిక యుగానికి పునాది వేస్తుంద ని పల్లా అన్నారు. ఫిబ్రవరి 7న ఉద్ధండరా యునిపాలెంలో శంకుస్థాపన జరగడం భవిష్యత్ తరాలకు ఇచ్చిన హామీగా పేర్కొన్నారు. దేశంలో నే తొలి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు దిశగా రాష్ట్రం ముందుకు సాగుతుం డడం గర్వకారణమన్నారు.ప్రధానమంత్రి నరేం ద్ర మోడీ విజన్‌కు అనుసంధానంగా, డిప్యూటీ సీఎం , పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ ల సమన్వయంతో రాష్ట్రాన్ని భవిష్యత్ టెక్నాలజీ కేంద్రంగా మార్చేందుకు కృషి జరుగుతోందన్నా రు.విశాఖకు గ్లోబల్ గుర్తింపు సుందర్ పిచాయ్ విశాఖపట్నాన్ని గ్లోబల్ ఏఐ హబ్‌గా అభివర్ణించ డం సీఎం దూరదృష్టికి అం తర్జాతీయ స్థాయి ప్రశంసగా పల్లా పేర్కొ న్నారు. గిగావాట్ స్థాయి కంప్యూటింగ్ సదుపాయాలు, అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వే వంటి మౌలి క వసతులతో విశాఖ అంతర్జాతీయ ఏఐ కేంద్రం గా ఎదుగు తుందని తెలిపారు. గూగుల్ భారీ పెట్టుబడు లతో వేలాది ఉద్యోగావకాశాలుసృ ష్టించనున్న ట్లు వెల్లడించారు.ఏఐక్వాంటం రంగంలో 7 కీలక ఒప్పందాలు
ఏఐక్వాంటం రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏడు కీలక ఒప్పందాలు కుదుర్చుకోవడం మరో మై లురాయిగా పల్లా అభివర్ణించారు. ఐబీఎం తో లక్ష మంది యువతకు శిక్షణ, యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంపుటింగ్ సెంటర్ తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఐఐటి మద్రాస్ తో ఏఐ ట్యూట ర్ ప్రాజెక్ట్ వంటి కార్యక్రమాలు రాష్ట్ర యువతకు బంగారు బాట వేస్తాయని తెలిపారు. ఇప్పటికే వేలాది మంది విద్యార్థులు క్వాంటం శిక్షణలో పాల్గొనడం రాష్ట్రంపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు.భవిష్యత్తును మలిచే నాయ కత్వంమార్పును ముందుగానే అంచనా వేసి దిశానిర్దేశం చేసే నాయకత్వమే చరిత్ర సృష్టిస్తుం దని పల్లా పేర్కొన్నారు. నాడు ఐటీతో రాష్ట్ర తలరాత మార్చిన నాయకుడు, నేడు క్వాం టంఏఐతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికి దిక్సూ చిగా నిలబెట్టబోతున్నారని ఆయన ఘనంగా కొనియాడారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీలు మంజూరు కోరుతూ వినతి పత్రం సమర్పణ

సానుకూలంగా స్పందించిన టిడిపి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 21:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలో పలు పంచాయతీలలో సీసీ రోడ్లు డ్రైనేజీలు మంజూరు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి, చింతపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మొట్టడం శరబన్న దొర తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరికి వినతి పత్రం సమర్పించారు.పలు గ్రామాలలో సిసి రోడ్లు నిర్మించాలని గత వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు స్పందనలో దరఖాస్తు చేసుకోగా గత ప్రభుత్వంలో ఎస్టిమేషన్లు వేసారని, కానీ సీసీ రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేపట్టలేదని కావున ఈ కూటమి ప్రభుత్వంలోనైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సిసి రోడ్లు డ్రైనేజీలు మంజూరు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారని ఎంపీటీసీ నాగమణి వినతి పత్రంలో గిడ్డి ఈశ్వరికి కోరారు.అందుకు సానుకూలంగా ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి స్పందించారని తెలిపారు.

## విజయనగరంలో ఈజేటి కుటుంబ వివాహ వేడుకల్లో సిరమ్మ సందడి



**భిమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 21:** విజయనగరం నగరంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్ (ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో) శనివారం ఈజేటి సంజీవరావురమణమ్మ దంపతుల కుమారు డు చి.వి. విమల్ కుమార్ వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. బంధుమిత్రులు, ఆతిథ్యుల సమక్షంలో వివాహం ఆనందోత్సా హాల మధ్య జరిగింది.వారి ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్స న్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు చిన్న శ్రీను కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ వేడుకలకు హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆమె వధూవరులకు పట్టు వస్త్రాలు అందించి, ఆశీస్సులు తెలియజేశారు.
కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, మైత్రి మీడియా సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అలాగే చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## గంజాయి,మాదకద్రవ్యాలు సైబర్ క్రైమ్ ప్రమాదాలపై అవగాహన -జీకే వీధి ఎస్సై కె.సురేష్

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రెల- రాళ్లగడ్డ పరిసర గ్రామాల ప్రజలకు గంజాయి,మాదకద్రవ్యాల మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరిగిందని గూడెం కొత్త వీధి ఎస్సై కె.సురేష్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియా యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల నుండి దూరంగా ఉండాలని సూచించారు. తాత్కాలిక ఆకర్షణలకు చిక్కి నేరపరిస్థితుల్లో పడితే జీవితం అస్తవ్యస్తమవుతుందని హెచ్చరించారు.కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎలా ఎదుర్కోవాలో, ఏ విధంగా మనం రక్షించుకోవాలో వివరిస్తూ, ఆడపిల్లలపై జరిగే ఆకృత్యాలు, అన్యాయాలు వంటి అంశాలపై కూడా వివరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో యువత, గ్రామవాసులు తదితరులు పాల్గొన్నారు.



# హిందూపురంలో బాలయ్య సొంతిల్లు

**అనంతపురం, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** హిందూపురం నియోజకవర్గం నందమూరి కుటుంబానికి ఒక కంచుకోట. దివంగత ఎన్టీ రామారావు నుంచి నేటి బాలకృష్ణ వరకు, ఈ గడ్డ నందమూరి వారసులకు ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూనే ఉంది. అయితే, గత పదేళ్లకు పైగా ఇక్కడ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బాలయ్యపై ప్రతిపక్షాలు గురిపెట్టే ప్రధాన అస్త్రం 'స్థానికత'. ఈ విమర్శలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, హిందూపురంలోనే తన సొంత ఇంటి నిర్మాణానికి బాలకృష్ణ భూమిపూజ నిర్వహించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.హిందూపురం నియోజకవర్గం నుంచి 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న నందమూరి బాలకృష్ణ, గత 12 ఏళ్లుగా అక్కడ అద్దె ఇంట్లోనే నివసిస్తున్నారు. షూటింగ్‌లు ఉన్నప్పుడు హైదరాబాద్‌లో, రాజకీయ కార్యకలాపాల కోసం హిందూపురం వచ్చినప్పుడు ఆ అద్దె ఇంట్లో ఉండేవారు. అయితే, ఇవాళ ఆయన తన భార్య వసుంధర దేవితో కలిసి హిందూపురం సమీపంలోని వనం కాలనీలో సొంత ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.వనం కాలనీలోని సర్వే నంబర్ 445లో సుమారు 81 సెంట్ల విస్తీర్ణంలో ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇది మూడు అంతస్తుల డూప్లెక్స్ తరహా భవనం కానుంది. ఇందులో నివాసంతో పాటు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు ప్రత్యేక హాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యేందుకు వీలుగా ఆఫీసు రూమ్‌లను నిర్మించనున్నారు. ఆధునిక హంగులతో పాటు ఒక చిన్న పార్క్, స్విమ్మింగ్ పూల్, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చేలా గ్రీనరీని ప్లాన్ చేసినట్లు సమాచారం.వైసీపీ నేతలు గతంలో పలుమార్లు "బాలకృష్ణ చుట్టపుచూపుగా వచ్చి వెళ్తారు, ఆయనకు ఇక్కడ సొంత ఇల్లు కూడా లేదు" అంటూ విమర్శలు చేసేవారు. ముఖ్యంగా వైసీపీ స్థానిక నాయకులు ఆయనను 'నాన్-లోకల్'గా చిత్రించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు సొంత ఇల్లు నిర్మించుకోవడం ద్వారా, తాను కేవలం గెలిచి వెళ్ళిపోయే వ్యక్తిని కాదని, ఇక్కడే శాశ్వతంగా ఉంటానని బాలయ్య సంకేతాలిచ్చారు. హిందూపురంలో బాలయ్యకు భారీ అభిమాన గణం ఉంది. అయితే, నాయకుడు ఎప్పుడూ అందుబాటులో ఉండరనే చిన్న అసంతృప్తి కార్యకర్తల్లో ఉండేది. ఇప్పుడు సొంత ఇల్లు ఉండటం వల్ల ఆయన నియోజకవర్గంలో గడిపే సమయం పెరుగుతుందని, తద్వారా స్థానిక సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అభిమానులు భావిస్తున్నారు. కేవలం సినిమాల్లోనే కాకుండా, రాజకీయాల్లోనూ తాను సీరియస్ అని బాలయ్య నిరూపిస్తున్నారు. ఇటీవల ఆయన తన సొంత నిధులు రూ. 84 లక్షలు వెచ్చించి నియోజకవర్గంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, ఇప్పుడు సొంత ఇల్లు కట్టుకోవడం వంటివి ఆయన నిబద్ధతను చాటుతున్నాయి.హిందూపురం నియోజకవర్గం అనంతపురం రాజకీయాల్లో అత్యంత కీలకం. ఇక్కడ పట్టు కోల్పోకుండా ఉండాలంటే భౌతికంగా అక్కడ ఉండటం అవసరమని బాలయ్య గుర్తించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## చింతకాయలకు ఫిక్స్...

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 21 పెన్ పవర్:** టీడీపీలో సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ కు త్వరలోనే కీలక పదవి లభించే అవకాశాలున్నాయి. అయితే తొలుత విజయ్ ను రాజ్యసభ కు ఎంపిక చేయాలని భావించినప్పటికీ ఆ ఆలోచన విరమించుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు కీలక పదవి రిజర్వ్ అయిందని, త్వరలోనే చింతకాయల విజయ్ సూపర్ పదవి దక్కబోతుందన్న సమాచారం ఉత్తరాంధ్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీ గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులన్నీ ఎక్కువగా యువతకే ఇస్తున్నారు. మంత్రివర్గంలో కావచ్చు. రాజ్యసభ స్థానాల్లో కావచ్చు.. మరేదైనా సరే యువతకు అవకాశం ఇస్తున్నారు.పార్టీ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని సీనియర్ నేతలను పార్టీ బలోపేతం కోసం వ్యూహాలను, రోడ్ మ్యాప్ లను సిద్ధం చేయడానికే పరిమితం చేయనున్నారు. వారి అవసరాలను, సేవలను పార్టీ వరకే ఉపయోగించుకున్నారు. ఇది ఫిక్స్. ఇక వచ్చే పదవులన్నీ యువతతోనే ఎక్కువగా నిండిపోతాయన్నది కూడా వాస్తవం. నారా లోకేశ్ భావి నేతగా ఎదుగుతున్న తరుణంలో ఆయన తనకంటూ ఒక టీమ్ ను సెట్ చేసుకోవడం ఇప్పటికే ప్రారంభమయింది. ఇంకా కొనసాగుతుందికూడా. అది ఎమ్మెల్సీ పదవి కావచ్చు. రాజ్యసభ పదవి కావచ్చు.. మరేదైనా కావచ్చు. వచ్చే పదవుల్లో ఎక్కువగా యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.అందులో భాగంగా అయ్యన్న పాత్రుడు కుమారుడు విజయ్ ను ఎమ్మెల్సీని చేసి కేబినెట్ లోకి తీసుకోవాలని కూడా పార్టీ నాయకత్వం యోచిస్తున్నారని తెలిసింది. దేశ రాజకీయాలకంటే రాష్ట్ర రాజకీయాల్లోనే చింతకాయల విజయ్ ను ఉంచాలని భావిస్తున్నారు. అయ్యన్నపాత్రుడు కోరిక కూడా అదే. పార్టీ సోషల్ మీడియా విభాగంలో యాక్టివ్ గా పనిచేయడమే కాకుండా చింతకాయల విజయ్ నారా లోకేశ్ కు అత్యంత సన్నిహితుడు. సామాజికవర్గం కోటా కూడా ఇందుకు పనిచేస్తుంది. మంత్రి వర్గ విస్తరణలో చింతకాయల విజయ్ ను కేబినెట్ లో తీసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. విజయ్ పడిన కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వడమే కాకుండా 2029 ఎన్నికలకు విజయ్ బీసీ కోటా కింద ఎంపికవుతారన్న టాక్ పార్టీ వర్గాల్లో బలంగా ఉంది.

## జెండాలు మోసిన వారికే అగ్రతాంబులం


**కాకినాడ, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. పార్టీ సభ్యత్వాల నమోదుతో జనసేన గ్రౌండ్ లెవెల్లో మరింత బలోపేతం అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకున్న వారు జనసేన విజయాలకు పనిచేస్తారన్న విశ్వాసంతో ఉన్నారు. పల్లెలు, పట్టణాల్లో జనసేన క్యాడర్ పెరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేన సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఇప్పటికే జనసేనకు కార్యకర్తల బలం ఉంది. అభిమానుల బలం కూడా జనసేన సొంతం. ఇక సామాజికవర్గం అండదండలు ఎటూ ఉన్నాయి. అదనంగా క్యాడర్ ను పెంచుకునేందుకు పవన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు.స్థానిక సంస్థల ఎన్నికలతో జనసేన రాష్ట్రంలో బలపడాలని చూస్తుంది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించాలంటే స్థానిక నాయకత్వం బలంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది. దీంతో పాటు జనసేనలో ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని చాలా మంది నిరాశలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారిని ఎంపిక చేయడమే ధ్యేయంగా పనిచేయాలని, సుదీర్ఘ కాలం పార్టీలో వారి కున్న హిస్టరీని చూసి ఎంపిక చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారు కూడా ఉన్నారు. 2014 నుంచి పార్టీలోనే ఉంటున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిసింది.జనసేన ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉందని జనసేనాని కూడా గుర్తించారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినప్పటికీ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అందరికీ న్యాయం చేయలేకపోయామని పవన్ కల్యాణ్ చెబుతున్నారు. కానీ పదవి రాని వారు మాత్రం తమకు జనసేనలో గుర్తింపు లేదని బాధపడుతున్నారు. అందుకోసమే ఇకపై ఒరిజినల్ జనసైనికులకు, వీరమహిళలకు నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై ఏ పోస్టు భర్తీ అయినా నామినేటెడ్ పోస్టులను ద్వితీయ శ్రేణి నేతల్లో బాగా కష్టపడిన వారిని గుర్తించి, పార్టీ జెండా మోసే వారికే ప్రయారిటీ ఇచ్చేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. త్వరలోనే అది అమలులోకి తీసుకురానున్నారు. ఇకపై జెండా మోసిన వారికే జై కొట్టనున్నారు.

## జగన్ పై కేసుల్లేవ్...

**విజయవాడ, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ విషయంలో కూటమి సర్కార్ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. జగన్ ను ఎప్పుడు అరెస్ట్ చేస్తారని? ఆయనపై కేసులు ఎప్పుడు నమోదవుతాయని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న తెలుగు తమ్ముళ్లకు ఇప్పుడు సమాధానం దొరికిందంటున్నారు. జగన్ పై కేసులు రాష్ట్రంలో నమోదయ్యే అవకాశాలు లేవు. అలాగే జగన్ ను అరెస్ట్ కూడా చేయడం జరగదు. ఇది ఎవరో చెప్పింది కాదు. టీడీపీ అగ్ర నేతల నుంచి వచ్చిన సమాచారం అంటున్నారు. జగన్ ను అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేసి సానుభూతి ఆయనపై కురిపించడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదు. వచ్చే ఎన్నికల్లో కూటమి తిరిగి అధికారంలోకి రావాలంటే జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదన్నభావన పార్టీ అగ్రనాయకత్వంలో వ్యక్తమవుతుంది.అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ జగన్ పై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మద్యం కేసులో కానీ, మరొక కేసులో కానీ వైసీపీ నేతలను, జగన్ కు అత్యంత సన్నిహితులను అరెస్ట్ చేశారు. ఒకరు కాదు... ఇద్దరు కాదు చాలా మంది జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో పనిచేసిన వారిని సయితం అరెస్ట్ చేశారు. కేసులు నమోదు చేశారు. అయితే జగన్ మీద మాత్రం ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంపై టీడీపీ సోషల్ మీడియాలో పార్టీ కార్యకర్తలు పెద్దయెత్తున విమర్శలు చేస్తున్నారు. జగన్ విషయంలో ఇంత నాన్చుడు ధోరణి ఎందుకని? రెడ్ బుక్ లో జగన్ పేరు లేదా? అని ప్రశ్నిస్తున్నారుకానీ చంద్రబాబు, లోకేశ్ మాత్రం జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని ఫిక్సయిపోయారు. జగన్ ను టచ్ చేస్తే సానుభూతి వస్తుందని, కూటమి ప్రభుత్వ విజయావకాశాలపై దెబ్బపడుతుందని ఢిల్లీ పెద్దలు కూడా సలహా ఇచ్చారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చేత అరెస్ట్ చేయించాలని కొన్నాళు చేసిన ప్రయత్నాలకు కూడా బీజేపీ అగ్ర నేతలు అంగీకరించలేదని తెలిసింది. చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ ఎంత భారీ మూల్యం చెల్లించుకున్నాడో వారు గుర్తు చేసి వద్దని చెప్పి పంపుతున్నారట. అందుకే జగన్ విషయంలో కూటమి ప్రభుత్వం ఈ టర్మ్ లో వెళ్లే అవకాశం లేదన్నది సుస్పష్టం. జగన్ కు అనవరంగా సానుభూతి తెచ్చి పెట్టే ఆలోచనలకు కూటమి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

# ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు

**తిరుపతి, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ... 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను... విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు కూడా టిడిపి కూటమి రాష్ట్రంలో ఉంది. కేంద్రంలో టిడిపి బలమైన భాగస్వామ్య పక్షంగా ఉంది.







ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు. ఎన్నికలకు ముందు, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపి కూటమిలో చాలామంది నేతలు చేరారు. ఇప్పుడు వారందరికీ రాజకీయ అవకాశాలు కల్పించడం అనేది కష్టం. ఇటువంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా 50 అసెంబ్లీ స్థానాలు, ఏడు పార్లమెంటు సీట్లు పెరిగితే మాత్రం కూటమికి ప్లస్ గా మారుతుంది. ఇంకోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు.. విభజనతో మరింత బలహీనమవుతాయి. ఇలా ఎటు చూసుకున్నా నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపి కూటమికి ఎక్కువగా మేలు జరుగుతుంది.

# లోకేష్ ను హీరో చేస్తున్న జగన్

**విజయవాడ, ఫిబ్రవరి 21, పెన్ పవర్:** వైసీపీ అధినేత మాజీ సీయం జగన్ మోహన్ రెడ్డి తెలిసి అన్నారో లేక అనుకోకుండా అనేసారో తెలీదు కానీ తనకు లోకేష్ తోనే పోటీ అని తేల్చశారు. తాజాగా పెట్టిన ప్రెస్ మీట్‌లో ఆయన చంద్రబాబు, పవన్‌తో పాటు నారా లోకేష్‌పై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా అయన టార్గెట్ లోకేష్ వైపే నడిచింది. శ్రీలంకలో ఇండియా ఆడుతున్న ౨20 వరల్డ్ కప్ మ్యాచ్ చూడడానికి ప్రత్యేకంగా లోకేష్ వెళ్ళాలా? ఇంట్లో కూర్చుని చూడకూడదా అంటూ ఆయన సెటైరికల్‌గా మాట్లాడారు. ఇప్పటికే లోకేష్‌పై వచ్చిన విమర్శలకు ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. సొంత డబ్బుతో మ్యాచ్ చూడడానికి వెళ్లినట్టుగానే చెప్పుకొచ్చారు లోకేష్. దానిపై మాజీ ముఖ్యమంత్రి హోదాలో ‾హ జగన్ ఇప్పుడు మాట్లాడడం ద్వారా సామాన్య జనాలకు ఒక మెసేజ్ ఇచ్చేసారు జగన్ అంటున్నారు ఎనలిస్ట్ లు. ఎందుకంటే సహజంగా జగన్ మాట్లాడే విధానం ఇలా ఉండదు అనేది వారి విశ్లేషణ.రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు మాత్రమే తన ప్రత్యర్థి అనీ వేరే ఎవరూ తనకు సమానులు కాదు అన్నట్టుగా జగన్ వ్యవహార శైలి ఉండేది. పాదయాత్ర చేసినప్పుడు గానీ సీయం అయ్యాక గానీ చంద్రబాబు టార్గెట్ గానే జగన్ మాటలు ఉండేవి. లోకేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కూడా ముక్తసరిగా మాట్లాడి ఆ టాపిక్ ని పెద్దగా హైలైట్ చేసేవారు కాదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషయంలోనూ ఆయన వ్యవహారశైలి అలానే ఉండేది. అధికారంలో ఉన్న ఐదేళ్ళలో ఒక్కసారి కూడా పవన్ ను పేరు పెట్టి పిలవ లేదు జగన్. కేవలం 'దత్త పుత్రుడు ' అని మాత్రమే ప్రస్తావించేవారు. కానీ తాజా ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్, లోకేష్ ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోనీ పవన్ ఇప్పుడు ఉప ముఖ్య మంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి తనతో సమానుడు అని భావించినా లోకేష్ ను టార్గెట్ చేయడం తో





భవిష్యత్ లో తనకూ లోకేష్ కూ మధ్య మాత్రమే అసలు సిసలు పోటీ అని ఫిక్స్ అయిపోయారా అనే అభిప్రాయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.అవునన్నా కాదన్నా ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలోనూ టీడీపీలోనూ నారా లోకేష్ అండ్ టీమ్ దే హవా అన్నది సుస్పష్టం. మొత్తం వ్యవహారాలు అన్నీ ఆయన టీమ్ చక్క బెడుతోంది. మోదీ, అమిత్ షా వంటి బీజేపీ అగ్ర నేతలు కూడా లోకేష్ తో వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్ టీడీపీ అధినేతగా లోకేష్ ని గుర్తిస్తున్నట్టుగానే ఉంది. టీడీపీ సోషల్ మీడియా యూనిట్స్ కూడా దాన్నే ప్రొజెక్ట్ చేస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా‾హ జగన్ కూడా లోకేష్ నే తన పొలిటికల్ ప్రత్యర్థిగా డిసైడ్ అయిపోయిన దృశ్యం తెరపైకి వచ్చేసింది. ఇదివరకూ చంద్రబాబు ను టార్గెట్ చేసి జగన్ మాట్లాడుతూ ఉంటే పవన్ పై ఆయన సామాజిక వర్గ నేతలు లోకేష్ పై జగన్ తరువాతి స్థాయి నేతలూ విమర్శలు గుప్పించే వారు. ఇప్పుడు డైరెక్ట్ గా జగనే లోకేష్ ను టార్గెట్ చేయడం చూస్తుంటే పొలిటికల్ గా కింది స్థాయి కేడర్ కు లోకేష్ తన ఫ్యూచర్ పొలిటికల్ ప్రత్యర్థి అనే సంకేతం ఇస్తున్నారా అనే డౌట్స్ రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి.

# దేశ తొలి విద్యా మంత్రి అబుల్ కలాం

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో విద్య అభివృద్ధికి తొలి బాట వేసిన విద్యాధికుడు అబుల్ కలాం ఆజాదే. ఆయన భారతదేశ మొద టి విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. నవంబర్ 11న ఆయన జన్మది నం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపు కుంటారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (నవంబర్ 11, 1888 --- ఫిబ్రవరి 22, 1958) స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి. ఆయన అసలుపేరు 'మొహి యుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలం పేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కా నగరంలో జన్మిం చారు. ఆయన వంశస్తులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్ లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు/ మౌలానాల వంశం నుండి వచ్చారు. ఆయన తల్లి అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాలు గల ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమ యంలో భారత దేశం నుండి మక్కా వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు.1890 లో అయన తమ కుటుంబంతో కలకత్తా వచ్చారు. ఆజాద్ సంప్ర దాయ ఇస్లామిక్ విద్య అభ్యసించారు. ఆయన విద్య ఇంట్లో సాగింది. మొదట తండ్రి పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించారు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం నేర్చుకున్నారు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నారు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందారు. ఆయన దివ్య ఖురాన్ పై భాష్యం రాశారు. స్వయంగా కవి సాహితీవేత్త అయిన ఆయన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్'ను రాశారు. విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టారు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్ లకు పరిమితం అయిన విషయం ఆజాద్ కు తెలిసి రెండు సంవత్సరాలలో, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటు చేసారు. ఆసమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించ సాగారు. ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశం యొక్క స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తున్నాదని భావించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరులను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నించారు.1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించారు. ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ -ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించారు. మౌలానా ఆజాద్, గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయినారు. ఆయనను ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. మౌలానా అబు ల్ కలాం ఆజాద్ 1940 (రాంగఢ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై, 1946 వరకు ఆ పదవిలో ఉన్నారు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాల పాటు జైలుశిక్ష అనుభవించారు.ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చింది. అంతేకాదు ఆయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్ప బడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వ విద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వ విద్యాలయాలు స్థాపించ బడ్డాయి. ఆయన సేవలకు గుర్తుగా 2008 లో భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును "జాతీయ విద్యా దినో త్సవం"గా నిర్ణయించింది.భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు అంకిత భావంతో పనిచేశారు.

# 6 ఏళ్ల తర్వాత తన రికార్డును తానే బ్రేక్ చేసుకున్న స్మృతి మంధాన..



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన మరోసారి తన క్లాస్ బ్యాటింగ్ చూపించింది. ఈరోజు (ఫిబ్రవరి 21) అడిలైడ్ లోని ఓవల్ మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో చెలరేగిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 176/6 అనే స్కోర్ చేయడంలో మంధాన కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో స్మృతి 55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. రెండో వికెట్‌కు జెమిమాహ్ రోడ్రిగస్ తో కలిసి 82 బంతుల్లో 121 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. జెమిమా (59) సైతం హాఫ్ సెంచరీ చేసింది.

ఈ ఇన్నింగ్స్‌తో స్మృతి మంధాన తన కెరీర్‌లో 33వ టీ20 అంతర్జాతీయ అర్ధశతకం నమోదు చేసుకుంది. అంతేకాదు, ఆస్ట్రేలియాలో భారత బ్యాటర్‌గా అత్యధిక వ్యక్తిగత స్కోర్ చేసిన ప్లేయర్ గా ఆరేళ్ల రికార్డును కూడా చెరిపేసింది. గతంలో ఆమె 2020లో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో 37 బంతుల్లో 66 రన్స్ చేసింది. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి నయా చరిత్ర సృష్టించింది. ఇదే సమయంలో, ఆస్ట్రేలియాపై మంధానకు ఇది 8వ 50 ప్లస్ స్కోర్ కావడం విశేషం. ఈ విషయంలో కూడా ఆమె టీమిండియా బ్యాటర్‌గా నెంబర్ స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా తో జరిగిన మ్యాచ్ ప్రారంభంలో నాలుగో బంతికి బౌండరీతో ఖాతా తెరిచిన స్మృతి, మూడో ఓవర్‌లో షఫాలి వర్మ (7) వికెట్ పడిన తర్వాత పవర్‌ప్లే చివరి ఓవర్ వేసిన సోఫీ మోలినెక్స్ బౌలింగ్ లో మంధాన 3 ఫోర్లు కొట్టి బ్యాటింగ్ లో వేగం పెంచింది. జస్ట్ 38 బంతుల్లో

హాఫ్ సెంచరీ పూర్తి చేసిన ఆమె, ఆ తర్వాత గేర్ మార్చి సెంచరీ దిశగా దూసుకెళ్లింది. చివరకు అన్నాబెల్ సదర్లాండ్ బౌలింగ్‌లో డీప్ మిడ్‌వికెట్ వద్ద క్యాచ్ ఇచ్చి అవుట్ అయింది. ఇక మంధాన – జెమిమా భాగస్వామ్యంతో భారత్ ఈ కీలక మ్యాచ్‌లో భారీ స్కోర్ సాధించగలిగింది.

# భారత్ ఘన విజయం.. 2-1 తేడాతో ఆస్ట్రేలియాపై సిరీస్ కైవసం



**హైదరాబాద్ పెన్ పవర్:** అడిలైడ్ లోని ఓవల్ స్టేడియంలో జరిగిన 3వ ౨20లో భారత్-- ఆస్ట్రేలియా జట్లు తలపడ్డాయి. నిర్ణయాత్మకమైన మ్యాచ్ లో 17 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించి.. దీంతో సిరీస్ ని భారత్ కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన టీమిండియా ముందుగా బ్యాటింగ్ తీసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో భారత మహిళల జట్టు 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. టీమిండియా బ్యాటర్లలో స్మృతి మంధాన (55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 పరుగులు) హాఫ్ సెంచరీ చేయగా, జెమిమా రోడ్రిగ్స్ (59) కూడా అర్ధ శతకంలో టీం భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్లో 177 పరుగుల టార్గెట్ తో బరిలో దిగిన ఆస్ట్రేలియాను 159/9 పరుగులకే టీమిండియా బౌలర్లు పరిమితం చేశారు. ఆష్లీ గార్డనర్ 57 హాఫ్ సెంచరీ చేయగా, లిచ్ఫీల్డ్ 26 దూకుడుగా ఆడినప్పటికీ ఆసీస్ ను మాత్రం గెలిపించడంలో విఫలమయ్యారు. వీరు ఇద్దరు మినహా మిగతా అందరూ బ్యాటర్లు తక్కువ పరుగులకే ఔట్ కావడంతో భారత్ ఈజీగా విజయం సాధించింది. టీమిండియా బౌలర్లలో శ్రీచరణి, శ్రేయాంక తలో 3 వికెట్లు, అరుంధతి రెడ్డి 2 వికెట్లు, రేణుక సింగ్ ఒక వికెట్ తీసుకుంది. ఆస్ట్రేలియా మహిళల జట్టుపై భారత్ ఘన విజయం సాధించడంతో పాటు ఈ సిరీస్ ని కైవసం చేసుకుంది. దీంతో ఆసీస్ గడ్డపై భారత్ మహిళల జట్టుకు ఇదే తొలి సిరీస్ విజయం. మ్యాచ్ అనంతరం భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. ఈ సిరీస్ విజయంపై ఆనందంగా ఉంది. ఈ విజయం మాకు చాలా ప్రత్యేకమైనది.. ఇది పూర్తిగా టీమ్ ఎఫర్ట్.. ప్రతి ఒక్కరూ జట్టుకు ఏదో ఒక విధంగా సహకరించడం చాలా సంతోషంగా ఉందని తెలిపింది. జెమిమా రోడ్రిగ్స్, స్మృతి మంధాన భాగస్వామ్యంపై సరైన సమయంలో వచ్చింది.. వారు ఇద్దరు జట్టుకు వారు పెద్ద బలంగా మారారు అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. ఇక మేం వికెట్లు తీసినప్పుడే మ్యాచ్ మన వైపు తిరుగుతుంది.. ఆస్ట్రేలియా లాంటి బలమైన జట్టు వికెట్లు తీయడం అంత సులభం కాదు.. కానీ మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి వికెట్ల పడగొట్టడంతో ఈ మ్యాచ్ గెలిచామని వెల్లడించింది. భారత్ చేతిలో ఓటమిపై ఆస్ట్రేలియా కెప్టెన్ సోఫీ మోలినెక్స్ మాట్లాడుతూ.. మంచి వికెట్‌పై టీమిండియాను కట్టడి చేశాం.. కానీ కీలక సమయంలో వికెట్లు కోల్పోవడమే మాకు తీవ్ర నష్టం కలిగించిందని తెలిపింది. పెర్రీ కోసం ఈ మ్యాచ్ గెలవలేకపోయినందుకు కొంచెం బాధగా ఉంది.. ఆమె మాకు అందరికీ పెద్ద ఇన్స్పిరేషన్.. ఆమె మరెన్నో మ్యాచ్‌లు ఆడాలని కోరుకుంటున్నాం పేర్కొనింది. వచ్చే వన్డే సిరీస్‌లో అలీసా హీలీ జట్టులోకి రావడం మాకు పెద్ద ప్లస్ అవుతుంది.. ఆ సిరీస్‌లో పరిస్థితిని మార్చేందుకు మా వంతు ప్రయత్నం చేస్తామని సోఫీ మోలినెక్స్ చెప్పుకొచ్చింది.

# అభిషేక్ శర్మ ఫామ్ గురించి టెన్షన్ వద్దు.. సూర్యకుమార్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026లో అభిషేక్ శర్మ టాప్ రన్‌గెటర్‌గా నిలుస్తాడని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేశారు. కానీ టోర్నీ ఆరంభంలోనే అభిషేక్ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో అతని ఫామ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలపై భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గట్టిగా స్పందించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే కీలక మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన స్కై, అభిషేక్ ప్రస్తుత ఫామ్ తనను ఏమాత్రం ఆందోళనకు గురి చేయడం లేదని స్పష్టం చేశాడు. అంతేకాదు, అతడిపై విమర్శలు చేసే వారిపైనే తనకు ఎక్కువ టెన్షన్‌గా ఉందని పేర్కొన్నాడు. అభిషేక్ శర్మ గురించి ఆందోళన చెందుతున్న వాళ్ల గురించి నేనే ఎక్కువగా ఆందోళన పడుతున్నాను అని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. అతడు తర్వాత ఆడే జట్ల పరిస్థితి ఏంటో ఆలోచించాలి అని పేర్కొన్నాడు. గత ఏడాది అభిషేక్ జట్టు కోసం అన్నీ చేశాడు.. ఇప్పుడు మేము అతడికి మద్దతుగా నిలిచే సమయం వచ్చింది అని స్పష్టం చేశాడు. కాగా అభిషేక్ శర్మ సామర్థ్యంపై పూర్తి నమ్మకం ఉంది.. అతడు త్వరలోనే తన గత ఫామ్‌ను తిరిగి అందుకుంటాడని స్కై భాయ్ ధీమా వ్యక్తం చేశాడు. అదే సమయంలో సూర్యకుమార్ మాటలు ప్రత్యర్థి జట్లకు ఇది ఒక హెచ్చరికగా మారిందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అభిషేక్ ఒక్కసారి ఫామ్‌లోకి వస్తే, ప్రత్యర్థి బౌలర్లకు కష్టకాలమేనన్న సందేశాన్ని సూర్య వ్యాఖ్యలతో క్లియర్ గా తెలిసిపోతుంది. వరుసగా విఫలమైతున్నప్పటికీ అభిషేక్ శర్మకు తుది జట్టులో స్థానం కొనసాగుతుందని బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ తెలిపారు. జట్టు మేనేజ్‌మెంట్‌లో అభిషేక్ ప్రదర్శనపై ఎలాంటి చర్చే జరగడం లేదని స్పష్టం చేశారు. అతను వరల్డ్ క్లాస్ ప్లేయర్, ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఇతర ఆటగాళ్లు బాధ్యత తీసుకుని నిలబడ్డారు.. ఇప్పుడు వరల్డ్ కప్‌లో చాలా కీలక దశకు చేరుకున్నాం.. ఈ సమయంలో అభిషేక్ తప్పకుండా రాణిస్తాడనే నమ్మకం మాకు ఉందని మోర్నీ మోర్కెల్ ధీమా వ్యక్తం చేశాడు. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్--8 దశలో భాగంగా రేపు (ఫిబ్రవరి 22న) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.



ప్రగ్యా జైస్వాల్: ఎ విజన్ ఇన్ గోల్డెన్ గ్లో

# సిద్ధు, నవీన్‌ల దారిలో రామ్...!



ఎనర్జిటిక్ స్టార్ రామ్ గత కొన్నాళ్లుగా సక్సెస్ కోసం చేయని ప్రయత్నం లేదు. ఇస్మార్ట్ శంకర్ తర్వాత ఆ స్థాయి విజయం రామ్ చూడలేదు. గత నాలుగు ఐదేళ్లుగా రామ్ చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద వర్కౌట్ కావడం లేదు. గత ఏడాది 'ఆంధ్రా కింగ్ తాలూక' సినిమాతో రామ్ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. రివ్యూలు కూడా పాజిటివ్‌గానే ఉన్నాయి. రామ్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. దర్శకుడి యొక్క పనితనం కి కూడా మంచి మార్కులు పడ్డాయి. స్క్రీన్ ప్లే బాగుందని అంతా మెచ్చుకున్నారు. కానీ సినిమాకు కలెక్షన్స్ మాత్రం రాలేదు. చాలా మంది ఓటీటీలో సినిమాను చూసి వావ్ అన్నారు కానీ, థియేట్రికల్ రన్ సమయంలో మాత్రం అటువైపు వెళ్లలేదు. సినిమాకు ఎంత పాజిటివ్ రెస్పాన్స్ వచ్చినా ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేద్దాం అన్నట్లుగానే ఉన్నారు.

**రామ్ ఆంధ్రా కింగ్ తాలూక సినిమా...**

ఆంధ్రా కింగ్ తాలూక సినిమా తర్వాత రామ్ సన్నిహితుల వద్ద చాలా ఆవేదన వ్యక్తం చేశాడని ఇండస్ట్రీ వర్గాల టాక్. ఆ సినిమా తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న రామ్ తిరిగి కొత్త సినిమా పనిలో పడ్డట్లుగా తెలుస్తోంది. ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం తనకు నమ్మకస్తుడు అయిన దర్శకుడు కిషోర్ తిరుమల వద్ద రామ్ ఒక కథను తీసుకున్నాడట. ఆ కథ తో పాటు మరో కథను రామ్ ఇప్పుడు డెవలప్ చేసే పనిలో ఉన్నాడు. రెండు కథల పై వర్క్ జరుగుతోంది. రామ్ కి ఒక రైటింగ్ టీమ్ ఉంటుంది. ఆ టీమ్ ఇప్పుడు ఆ రెండు కథలను ఫైనల్ చేసే విధంగా సిట్టింగ్స్ లో ఉన్నారు. ఇక్కడ చెప్పుకోవద్ద విషయం ఏంటంటే కథ చర్చల్లో రామ్ ప్రధానంగా పాల్గొంటున్నాడు. అధికారికంగా ఈ సినిమా కు రామ్ రైటర్ గా వ్యవహరించబోతున్నట్లుగా ఆయన సన్నిహితులు, మీడియా సర్కిల్స్ వారి ద్వారా సమాచారం అందుతోంది.

**సిద్ధుజొన్నలగడ్డ, నవీన్ పొలిశెట్టి....**

ఇప్పటికే నవీన్ పొలిశెట్టి, సిద్ధు జొన్నలగడ్డ వంటి యంగ్ హీరోలు కథ విషయంలో చాలా ఇన్వాల్వ్ అవుతారు. అంతే కాకుండా రైటింగ్ విషయంలో ఇద్దరు హీరోలు పూర్తి ఇన్వాల్వ్‌మెంట్ అవుతారని టాక్ ఉంది. టైటిల్ కార్డ్ పడకున్నా దర్శకత్వం సైతం ఈ హీరోలు చేస్తారు అనే టాక్ ఉంది. ఆ విషయం పక్కన పెడితే ఇప్పుడు రామ్ కూడా రైటింగ్ పై పూర్తి ఫోకస్ పెట్టాడని తెలుస్తోంది. చాలా సినిమాలు చేసిన అనుభవం ఉన్న రామ్ కి రైటింగ్ పై పట్టు ఉండటం చాలా కామన్ విషయం. అయితే పూర్తి ఇన్వాల్వ్‌మెంట్‌తో రైటింగ్ పై దృష్టి పెట్టడం ఎంతవరకు సాధ్యం అని కొందరు భావిస్తున్నారు. సినిమా షూటింగ్‌కి ముందు స్క్రిప్ట్ విషయంలో రామ్ ఇన్వాల్వ్‌మెంట్ ఉంటే మేకింగ్ సమయంలోనూ ఆయన ఇన్వాల్వ్‌మెంట్ ఉండే అవకాశం ఉంటుందని కొందరు అంటున్నారు. ఇప్పటి వరకు రామ్ తదుపరి సినిమా దర్శకుడు ఎవరు అనే విషయం లో క్లారిటీ రాలేదు.

**రామ్ నిర్మాణంలో కొత్త సినిమా...**

నవీన్, సిద్ధు సినిమాలకు దర్శకులు కొత్త వారు పని చేస్తారు. దాంతో వీరి ఇన్వాల్వ్‌మెంట్ ఎక్కువగా ఉంటుందని అంటారు. అందుకే రామ్ సైతం తన తదుపరి సినిమాకి కొత్త దర్శకుడిని తీసుకుంటే అన్ని విధాలుగా బాగుంటుంది అనేది ఆయన కాంపౌండ్ ఆలోచనగా తెలుస్తోంది. కేవలం రైటింగ్ విషయంలోనే కాకుండా నిర్మాణంలోనూ రామ్ పాత్ర ఉండే అవకాశాలు ఉన్నాయి. తన సొంత బ్యానర్‌లో రామ్ ఈ సినిమాను నిర్మించే యోచన చేస్తున్నాడని తెలుస్తోంది. స్క్రిప్ట్ ఫైనల్ అయ్యాక నిర్మాతలు ఎవరూ సెట్ కాకుంటే అప్పుడు రామ్ సొంతంగా రంగంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. మొత్తానికి రామ్ ఈసారి సొంత ప్రయోగం చేయాలని నిర్ణయించుకున్నాడు. మరి ఈ ప్రయోగం ఎంతవరకు సఫలం అవుతుంది అనేది చూడాలి. రామ్ గత చిత్రాల ఫలితాలు కచ్చితంగా రాబోయే సినిమాపై ఉంటుంది. దాన్ని అధిగమించే విధంగా ఈ సినిమా ఉండాలి అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.



నేహా శర్మ యొక్క బ్లాక్ మ్యాజిక్: స్వచ్ఛమైన చక్కదనం యొక్క విజన్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965